# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 330: మహిళలు, మరియు సమాజంలో ఇతర సమస్యలు
**జులై 27, 2024**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 42-48 నుండి తీసికొనబడినవి

స్వామి! ఈనాటి సమాజంలో కొన్ని వింత విషయాలు వింటున్నాం. ప్రజలు మహిళా విముక్తి ఉద్యమం గురించి మాట్లాడుతుంటారు. మహిళలకు అనాది కాలం నుండి సరి అయిన గౌరవం ఇవ్వలేదని కొందరు అంటుంటారు. లింగ భేదాల వల్ల మహిళలకు ఎప్పుడూ న్యాయమైన స్థానం ఇవ్వలేదని మరి కొందరు అసంతృప్తి తెలియ జేస్తున్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు మగ వారితో సమానంగా అర్హతలు లభించాలని పోరాడుతున్నారు. సమాజంలో స్త్రీల స్థానం ఏమిటో మీరు తెలియ జేయండి.

భగవాన్: ఆధ్యాత్మిక పరంగా చూస్తే అది సరి కాదు. శారీరిక భేదాలు ఉన్నా అందరిలో ఆత్మ ఒకటే. కానీ ఎవరు వారి కర్తవ్యాలను నిర్వహించాలి. సమాజంలో స్త్రీ పురుషులు రెండు చేతులు, రెండు కళ్ళు, రెండు పాదాల వంటి వారు. ఒకరు పాజిటివ్ అయితే ఇంకొకరు నెగెటివ్. కరెంటు పని చేయడానికి రెండూ అవసరం. ఈ ఏకత్వం వివరించడానికే శివుడిని అర్ధనారీశ్వరుడు అంటారు.

స్త్రీ పురుషులు శక్తి (energy), పదార్థం (matter) వంటివి. స్త్రీని ఆదిశక్తి, పరాశక్తి అని పిలుస్తారు.

భారత దేశ చరిత్రలో స్త్రీలకి ప్రత్యేక స్థానం ఉంది. వారిలో ఎంతో మంది త్యాగం, జ్ఞానం, భక్తికి పెట్టిన పేర్లు. వారి పతులకు హితమైన సలహాలు, సూచనలు ఇవ్వగలిగిన వారు. సావిత్రి, మండోదరి, సీతా, అనసూయ, తార, దమయంతి, మదాలస, ద్రౌపది వంటి వారు అందరికీ తెలుసు. ద్రౌపది తన అయిదుగురు భర్తలకు శ్రద్ధతో సేవ చేసి, ఆమెకు ఏమి పని చెప్పినా కాదనకుండా చేసి, సంతృప్తిగా ఉండేది.

ఆది శంకరునికి, మండన మిశ్రకు మధ్య తర్కములో మండన మిశ్ర యొక్క భార్య ఉభయ భారతి వారికి న్యాయాధిపతిగా ఉండి చివరికి ఆది శంకరునిదే గెలుపు అని నిర్ణయించింది.

ప్రాచీన కాలంలో గార్గి, మైత్రేయి వారి పాండిత్యానికి, ఆధ్యాత్మికానికి ఔన్నత్యం పొందారు. ఈ యుగంలో కూడా ఛత్రపతి శివాజీ యొక్క తల్లి, గాంధి గారి తల్లి వారిని ఎలా తీర్చి దిద్దారో వినని వారెవరు? తల్లి వడిలో నేర్చుకున్న గొప్ప వారు.

కౌసల్య, సీతా దేవి యొక్క ప్రేమ, ఆదర్శం వల్ల వారి వారి కొడుకులు శ్రీ రాముడు, లవ కుశలు ప్రపంచమంతటికీ ఆదర్శవంతులుగా తరతరాలుగా నిలిచి పోయే కీర్తి సంపాదించుకున్నారు.

మనం రోజు చెప్పుకునే ప్రార్థనలలో 'మాతృ దేవో భవ' అని చెప్పుకుంటాం. సీతారాములు, గౌరీశంకరులు, లక్ష్మీనారాయణులు, ఇలా ముందు స్త్రీల పేర్లు వస్తాయి. ప్రాచీన కాలంలో స్త్రీలను అవమానించడం, అగౌరవ పరచడం, అలక్ష్యం చేయడం వంటివి జరిగేవి కాదు. మాతృభూమి, మాతృభాష వంటి పదాలు స్త్రీలకు విలువ నిచ్చే పదాలే కదా?

స్త్రీలు అనుభవించ గల అర్హతలు ఏడు కలవని  భగవద్గీత చెప్తుంది. ఆమె తన సంసారానికి చేసే సేవల వల్ల ఎన్నో బిరుదులు సంపాదించుకుంది. తన ఇల్లుని చూసుకుంటుంది కనుక ఆమెను ఇల్లాలు అన్నారు. భర్తను ధర్మ మార్గంలో నడిపిస్తుంది కనుక సహధర్మ చారిణి అంటారు. ధన ధాన్యాలకు, శాంతి సుఖాలకు స్వరూపం కనుక ఆమెను గృహలక్ష్మి అన్నారు. పురుషునిలో సగ భాగం ఆమె కనుక అర్ధాంగి అన్నారు.

స్త్రీ అనగా సహనం, ఓర్పు, త్యాగం, గౌరవం, వినయ విధేయతలకు చిహ్నం. ఈ గుణాలు పురుషులలో సాధారణంగా కనబడవు. తన బిడ్డ కొరకు, భర్త కొరకు జీవితమునైనా అర్పించగలదు. తన సంసారం యొక్క క్షేమ శ్రేయస్సుల కొరకు ఎంతో కృషి చేస్తుంది. దేశానికే వెన్నెముక స్త్రీ. కుటుంబానికి ప్రకాశం, ఉల్లాసం చేకూర్చునది స్త్రీ.

స్వామి**!** మా రంగంలో తప్పనిసరిగా మార్పు రావాలి**.** ప్రజా జీవిత రంగాలన్నీ మలినమైపోయి అసహ్యకరంగా**,** బాధాకరంగా తయారయ్యాయి**.** మార్పు ఎలా తీసుకురావాలి**?**

భగవాన్**:** నిజానికి చదువు రాని అమాయకపు పల్లెల్లోని ప్రజలు సంస్కారవంతులైన చదువుకున్న పట్టణపు ప్రజల కంటే సుఖ శాంతులతో, ప్రేమతో కూడిన సంబంధ బాంధవ్యాలతో కలసి మెలసి ఉంటున్నారు. పట్టణపు ప్రజలు అహంకారంతో, అసూయతో నిండి ఉంటున్నారు. ఎటువంటి మార్పు తీసుకు రావాలన్నా వారు కృషి చేయాలి. అహంకారం, డంబం, అసూయ, ద్వేషం వంటి దుర్గుణాలను తొలగించుకోడానికి శ్రద్ధతో కృషి చేయాలి.

వెన్న మెత్తగానే ఉంటుంది.  కానీ నేయి చేయడానికి దానిని వేడి చేయాలి. అదే విధంగా ఏ మార్పు తీసుకురావాలన్నా మీరు కృషి చేయాలి. మంచి వారి వద్ద మంచినే వినాలి. ఈ శ్రవణం అన్నది మొదటి మెట్టు. వింటే సరిపోదు. విన్న మంచి వాటిని మళ్ళీ మళ్ళీ తలచుకొని, మననం చేసుకోవాలి. మూడవ మెట్టు విని నేర్చుకున్న దానిని సాధనలో పెట్టడం, అంటే నిదిధ్యాసన.

ఒక చిన్న ఉదాహరణ. మొట్టమొదట వంటింట్లో అన్నం వండుతారు. దానిని భోజనశాలకు తీసుకొచ్చి వడ్డిస్తారు. ఆ తరువాతే ఆరగిస్తారు. అప్పుడు ఆ తిన్నది అరిగి, జీర్ణమై ఆ శక్తి శరీరంలోని వివిధ అంగాలకి చేరుకుంటుంది కదా? శ్రవణం వంట చేయడం వంటిది, మనన వడ్డించడం, ఆరగించి జీర్ణించుకోవడం నిదిధ్యాసన.

స్వామి**!** మేము ఎప్పుడూ తొందరలో ఉంటున్నాము**.** కాలంతో **,** కర్తవ్యంతో పోటీ పడుతూ అనేక చోట్లకి పరిగెడుతున్నాము**.** ఇటువంటి స్పీడు జీవితంలో ఆధ్యాత్మిక మార్గం అనుసరించడం వీలౌతుందా**?** ఈ ఆధ్యాత్మిక మార్గం కూడా తొందరగా చేరుకోవచ్చా**?**

భగవాన్**:** ఈనాడు మీలో ఉండే ఎన్నో రోగాలకు కారణం hurry, worry, curry అనే మూడిటి వల్ల. Haste makes waste, waste makes worry. So don’t be in a hurry. సహనం అత్యంత అవసరం. షిరిడి అవతారంలో శ్రద్ధ, సబూరి అనే రెండింటి గురించి నొక్కి చెప్పాను.

ఆఫీసుకు పోవడానికి జనాలు రైలో బస్సో పట్టుకోవడానికి పరిగెట్టడం మామూలే. సినిమా హాలుల ముందు లైనులలో ఎన్ని గంటలైనా నిలబడతారు. కానీ ఇక్కడకొస్తే మీ వాచీలు చూసుకుంటారు, స్వామి ఇంకా దర్శనానికి రాలేదేంటి అని. పరిపూర్ణ ఆనందం అనుభవించాలంటే సహనం కావాలి. ఏది జరగాలన్నా

భగవంతుడు నిర్ణయించిన సరియైన కాలం ఒకటి ఉంటుంది. ఎన్నో ఏళ్ళు కలిసి తిరిగినా అర్జునుడు భగవద్గీత వినడానికి 74 ఏళ్ళు వేచి ఉండాల్సి వచ్చింది.

అదే విధంగా మీరు కూడా వేచి ఉండాలి. “ఇదేంటి? స్వామి నాతో మాట్లాడటం లేదేంటి?” అని అనుకోకూడదు. సరి అయిన కాలం వచ్చినప్పుడు చేయవలసింది చేస్తాను. ఫలము పండిన వెంటనే అదే చెట్టు నుండి రాలిపోతుంది. అదే విధంగా మీరు కూడా మీ కాలం పండేంత వరకు వేచి ఉండాలి. ఆధ్యాత్మిక రంగంలో తొందర పడకూడదు.

స్వామి! ఈనాడు ఎక్కువెక్కువ ధనం సంపాదించడమే ధ్యేయమై పోయింది. గర్వం, అహంకారం అదుపు లేకుండా పెరిగి పోతున్నాయి. ఈ పెడ మార్గానికి పరిష్కారం తెలపండి.

భగవాన్: భూమి సూర్యుని చుట్టూ ఎలా తిరుగుతుందో ఈనాడు మానవుడు డబ్బు చుట్టూ తిరుగుతున్నాడు. కానీ డబ్బుతో వచ్చేది సౌఖ్యము, సౌకర్యము మాత్రమే. డబ్బు చేకూర్చలేనివి ఎన్నో ఉన్నాయి.

డబ్బుంటే ఫైవ్ స్టార్ హోటల్ లో విందు భోజనం చేయొచ్చు
కానీ ఆకలిని కొనగలవా?
అందమైన శయనం కొనగలవు
కానీ నిద్రను కొనగలవా?
కొత్త కొత్త మందులు కొనగలవు
కానీ చనిపోయే వాడికి ఆయువు కొనగలవా?

డబ్బుంటే ఏదైనా చేయొచ్చు అనుకుంటారు కానీ అది నిజం కాదు. వ్యసనాలకి దారి తీస్తుంది. మనిషికి రెండు సాధకములు కలవు – Head, Heart. Head కర్తవ్యాన్ని మోస్తుంది. అందులో ప్రవృత్తి గురించి జ్ఞానం అంతా కలదు. కానీ Heart అనేది నివృత్తికి, అనగా అంతర్ జాగృతికి చిహ్నం. త్యాగం, సత్యం, దానం, ప్రేమ, దయ, ఇవన్నీ హృదయం నుండి ఆవిర్భవిస్తాయి. బయట కనబడేది అంతా Art. కానీ Heart అనేది లోపల ఉంటుంది. బయట కనబడే Art చూసి ఆవేశ పడకండి.

ఎన్ని కరెంటు ఫ్యానులున్నా చక్కని చిరుగాలితో పోలలేవు. టాంకు నీరు, నదిలో నీరు, ఏటిలో నీరు వర్షపు నీరుతో పోలలేవు. భగవంతుడు అనంతుడు. అతని ముందు మానవుడు ఏపాటి? అయినా ఎందుకు అంత గర్వం, అహంకారం? పర్వతాలు ఎత్తుగా ఉండొచ్చు. కానీ పర్వతం పై నుండి నీరు క్రిందికే ప్రవహిస్తుంది. అదే విధంగా నువ్వు గొప్ప పండితుడు అవ్వొచ్చు, గొప్ప పదవిలో ఉండొచ్చు. కానీ గర్వం, అహంకారం ఉంటే నాశనం తప్పదు. ప్రకాశం పైకి ప్రచురిస్తుంది. అదే విధంగా జ్ఞాన ప్రకాశం పైపైకి తీసుకెళ్తుంది.

వచ్చే వారం స్వామి మరిన్ని సందేహాలను తీరుస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్